

పశువుల ఎరువు ఉపయోగించాలి

వ్యవసాయ భూముల్లో పశువుల ఎరువు తప్పనిసరిగా ఉపయోగించాలని సుస్థిర వ్యవసాయ రంగం పరిశోధకుడు శ్రీనివాస్ తెలిపారు.

- 8లో



సుర్మా.. ఆరోగ్యప్రదాయిని

ముస్లింలు పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో 'సుర్మా' ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూ ప్రత్యేకత చాటుతోంది.

- 8లో

గరిష్టం/కనిష్టం

38⁰ /24⁰

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీలింగ్ భూములను పేదలకు పంచాలి



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల శివారులోని ఠాగూర్ లక్ష్మణ్ సింగ్ అక్రమ సీలింగ్ భూముల్లో నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం లక్ష్మణ్ సింగ్ భూముల్లో కొంత మంది నిర్మాణాలు చేపట్టడంతో వాటిని అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినయలతతో ఫోన్‌లో మాట్లాడారు. సీలింగ్ భూములు కోర్టు పరిధిలో ఉన్నాయని, ఆదివారం కావడంతో అధికారులు ఎవరు ఉండరనే ఉద్దేశంతో కొంత మంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 193, 198 సర్వే నంబర్లలో అక్రమ సీలింగ్ భూములు 164 ఎకరాలు ఉందని, ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని, లేదంటే గుడిసెలు వేస్తామన్నారు. ఈ భూములపై హైకోర్టులో కేసు నడుస్తుందని, అయినప్పటికీ కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, బొట్ల శ్రీనివాస్, దస్తగిరి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు గోపి, విజేందర్, మండల నాయకుడు దేవదానం, బాల్నె వెంకటమల్లయ్య, రమేష్ ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు రవీందర్‌శర్మ, అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ హోమం, బలిహరణం, మహాపూర్ణాహుతి, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలను ముగిసినట్లుగా ఈఓ లక్ష్మిప్రసన్న ప్రకటించారు. ఉదయం నుంచి జరిగిన కార్యక్రమంలో ఈఓ లక్ష్మిప్రసన్న-విశ్వక్సేన, ఉత్సవ కమిటీ మామిడాల యాదవరెడ్డి-జానకి, గుల్లపల్లి శ్రీనివాస్-భవాని, ప్రీతంరాజు, సంగోజు మోహన్‌చారీ- శంకరలక్ష్మి, ధర్మకర్తలు గట్టు ఎల్లయ్య, జక్కుల రాజశేఖర్-కుష్బు, పుట్ట కిరణ్‌రెడ్డి, గాజుల రజని, పుల్యాల నారాయణరెడ్డి, నారాయణ, మధు, బాలరాజు,ఉప్పరి గణేష్ దంపతులు చక్రస్నానంలో పాల్గొన్నారు. నారగోని రాజు, పన్నీరు అశోక్, ఆకుల సాంబరాజు, మాజీ చైర్మన్ మూల నాగరాజు, జిల్లా రాజు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ రమేష్, జూనియర్ వీరన్న, లక్ష్మి, వసంత, కృష్ణ, మహేష్, విశాల్, శేఖర్, మల్లికార్జున్, రాజశేఖర్, హరిశంకర్, వసంత, స్వరూపలు సౌకర్యాలు కల్పించారు.

కొనసాగుతున్న ఇంటర్ మూల్యాంకనం

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 16 నుంచి కొనసాగుతుంది. ఇప్పటికే మూడు దశల్లో వివిధ సబ్జెక్టుల పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుండగా.. ఆదివారం బాటనీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. బాటనీ జవాబు పత్రాల మూల్యాంకనానికి 91 మంది అధ్యాపకులు, జువాలజీకి 120 మంది అధ్యాపకులు, హిస్టరీ సబ్జెక్టుకు 12 మంది అధ్యాపకులు రిపోర్టు చేశారని క్యాంప్ ఏసీఓ ధర్మేంద్ర తెలిపారు. ఇప్పటి వరకు తెలుగు, హిందీ జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయ్యింది. ఈక్యాంపులో మూల్యాంకనం ప్రక్రియ ఏప్రిల్ 2లేదా 3వ తేదీ వరకు పూర్తి కావొచ్చని భావిస్తున్నారు.

పాత నేరస్తులపై ఆర్‌పీఎఫ్ నిఘా

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) పోలీసులు పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఇటీవల హైదరాబాద్ రసూల్‌పుర ఘటనలో నార్త్ ఇండియా నుంచి దొంగతనానికి వచ్చిన వారిలో ఒకరు కాజీపేట జంక్షన్‌లో పట్టుబడ్డాడు. దీంతో నార్త్ ఇండియా, సౌత్ ఇండియా కేంద్రంగా రైళ్లలో, వివిధ మహా నగరాల్లో గతంలో దొంగతనాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ మేరకు కాజీపేట ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో 31 మంది నేరస్తుల ఫొటోలతో రోగ్స్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. గతంలో రైల్వే ప్రాపర్టీ అఫెండర్స్, మొబైల్స్ బ్యాగుల అపహరణకు పాల్పడిన నేరస్తుల తీరుపై ఆరా తీస్తున్నట్లు కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు తెలిపారు.

వేసవి భత్యం అందేనా..!

- మూడేళ్లుగా ఉపాధి కూలీల నిరీక్షణ
- పని ప్రదేశాల్లో సౌకర్యాలూ కరువే
- ఎండల తీవ్రతతో తప్పని ఇబ్బందులు

ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు వేసవి కాలంలో ప్రత్యేకంగా అమలు భత్యం విషయంలో ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. గడిచిన మూడేళ్లుగా వేసవి భత్యం ఊసే లేకపోవడం, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాకపోవడంతో అసలు.. భత్యం ఇచ్చేది ఉందా లేదా.. అనే సందిగ్ధం నెలకొంది. దీనికి తోడు ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు లేమితో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

- స్టేషన్‌ఘన్‌పూర్



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



జిల్లాలో గ్రామాలు	:	281
జాబ్‌కార్డులు	:	1,17,851
కూలీలు	:	2,34,149
సరాసరి రోజు కూలి	:	రూ.174

పేద కూలీలకు సొంత ఊరులోనే పని కల్పిస్తూ వలసలను నివారించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నది. ఈజీఎస్ పథకంలో పంట పొలాలు చదును చేయడం, చెరువులు, కుంటలు, బావుల్లో పూడిక తీయడం, వ్యవసాయ క్షేత్రాలకు దారులు వేయడం, హరితహారంలో మొక్కలు నాటడం, కంచెలు ఏర్పాటు చేయడం తదితర పనులు చేపడుతున్నారు. వ్యవసాయ పనులు పూర్తయ్యాక వేసవికాలంలో ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడం, వ్యవసాయ పనులు పూర్తి కావడంతో జిల్లాలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. సాధారణంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో వేసవి భత్యం అమలు చేసేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి, ఏప్రిల్‌లో 25 శాతం, మే నెలలో 30 శాతం అమలు చేస్తారు. అయితే ఈ ఏడాది మార్చి నెల పూర్తి కావస్తున్నా ఇంతవరకు వేసవి భత్యం ఊసే లేదు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఈజీఎస్‌కు సంబంధించి టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కొత్తగా తీసుకొచ్చిన ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించి ఆప్షన్ లేదని సంబంధిత టెక్నికల్ సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఈ ఏడాదైన వేసవి భత్యం అమలవుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సౌకర్యాలు లేక తిప్పలు

ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో సరైన సౌకర్యాలు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో జనగామ మున్సిపాలిటీ మినహా అన్ని మండలాల పరిధి 281 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. రోజురోజుకూ కూలీల సంఖ్య పెరుగుతుండగా ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షిస్తున్నారు. మొత్తంగా 1,17,851 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉండగా వాటిలో 2,34,149 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కొక్కరికి కూలి రూ.170 నుంచి రూ.200 వరకు చెల్లిస్తున్నారు. అయితే వేసవిలో ఉపాధి పనులు చేపట్టే ప్రదేశంలో నీడ, తాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స కిట్లు తదితరాలు అందుబాటులో ఉండాలి. ఈ సౌకర్యాల గురించి సమావేశాల్లో చెప్పడమే తప్ప ఆచరణలో కనిపించడంలేదు. మండుటెండలోనే కూలీలు పనులు చేస్తూ తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. పని ప్రదేశంలో తాగునీటి వసతి కల్పించని పక్షంలో భత్యం అదనంగా రూ.5 చెల్లించాల్సి ఉంటుంది.

ఎండాకాలం భత్యం చెల్లించాలి



ప్రతి ఏడాది ఎండాకాలంలో పనిచేస్తే అదనపు కూలి ఇచ్చేవారు. మూడేళ్లుగా ఇవ్వడం లేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదంటున్నారు. గిట్లయితే బతికేది ఎట్ల. ఎండాకాలం భత్యం అందించి ఆదుకోవాలి.

- భాస్కుల యాకంత, ఉపాధి కూలీ

పనిచేసే చోట సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి పనులు చేసేచోట సౌకర్యాలు లేవు. నీడ, తాగునీరు వసతి లేదు. ఎండలో పనిచేయడం చాలా కష్టంగా ఉంది. ఎండలు ముదరకముందే పనిచేసే చోట వసతులు కల్పించాలి.

- చేపూరి కుమార్, ఉపాధి కూలీ

అవినీతి మయం!

- తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి
- ఇప్పటికే ఇద్దరు అధికారులను పట్టుకున్న ఏసీబీ అధికారులు

బచ్చన్నపేట: భూ రికార్డులను భద్రపర్చే తహసీల్ కార్యాలయాన్ని రైతులు దేవాలయంగా చూస్తారు. అన్నదాతల జీవనోపాధి కోసం రూ.లక్షలు పెట్టి భూములను కొనుగోలు చేసి రెవెన్యూ అధికారులు ఇచ్చే పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఆ రూ.లక్షలను చూసుకుంటారు. రెవెన్యూ అధికారులు అంటే అన్నదాతలకు అమితమైన గౌరవం. అలాంటి తహసీల్దార్ కార్యాలయాల్లో కొందరు అధికారులు లంచాలకు కక్కుర్తి పడి అమాయక రైతులను ఆసరా చేసుకుని అక్రమంగా డబ్బులు సంపాదించుకుంటున్నారు.

సర్వేయరే సూత్రధారి

మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కొమ్మాట రఘుపతి ఎంసీ ఫీజు కట్టి తన భూమిని సర్వేయర్ రవీందర్ చేత కొలిపించాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న 1.20 ఎకరాల భూమి నీ పక్కనే ఉంది. కనుక నీకే వర్తిస్తుందని, దానిని రికార్డు చేయడానికి తహసీల్ కార్యాలయంలో కొలిపాక సుమన్‌ను కలవాలని సలహా ఇస్తాడు. దాని ప్రకారమే సుమన్‌తో మాట్లాడి రూ.4.50 లక్షలు చెల్లించినా ఆ భూమిని రికార్డుకు ఎక్కించక, ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వకపోవడంతో రఘుపతి తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. ఆయన చావుకు ఇద్దరు అధికారులు బాధ్యులయ్యారు.



బచ్చన్నపేట తహసీల్ కార్యాలయం

ఏసీబీ అధికారుల దాడులు

తహసీల్ కార్యాలయంలో గతంలో రెండు సార్లు లంచాలను డిమాండ్ చేసిన నాయబ్ తహసీల్దార్ రాజేందర్, మరోమారు జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌లను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని వారికి తగిన శిక్ష విధించారు.

ఇంటెలిజెన్స్ నిఘా

బచ్చన్నపేట తహసీల్ కార్యాలయంపై ఇంటలిజెన్స్ అధికారులు నిఘా పెట్టినట్లు సమాచారం. డబ్బులు ఇచ్చిన వారితో రహస్యంగా మాట్లాడుతూ విషయాన్ని బయటకు పొక్కకుండా పలు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రక్షాళన చేయాలి..



కార్యాలయంలో పైసలు ఇవ్వంది ఫైలు కదలడం లేదు. అధికారులపై నియంత్రణ కరువైంది. కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలకు వెళ్తే ఓ అధికారి కాలయాపన చేస్తూ.. నిర్లక్ష్య సమాధానం చెప్తున్నాడు. కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలి.

- బెల్లంకొండ వెంకటేష్, సీపీఎం మండల కార్యదర్శి

నేరుగా సంప్రదించాలి..



రైతులకు ఎలాంటి భూ సమస్యలు ఉన్నా.. నేరుగా తహసీల్దార్‌ను సంప్రదించాలి. కార్యాలయ అధికారులు ఎవరైన డబ్బులు అడిగితే నా దృష్టికి తీసుకువస్తే వారిపై చర్య తీసుకుంటా. ఇకముందు ఇలాంటి ఘటనలు జరుగకుండా చూస్తాం.

-విశాలాక్షి, తహసీల్దార్,బచ్చన్నపేట

బీజేపీ వరంగల్ అభ్యర్థిగా 'అరూరి'

- ఎట్టకేలకు ప్రకటించిన అధిష్టానం
- ఇటీవలే కమలం పార్టీలో చేరిన రమేశ్



సాక్షి ప్రతినిధి, వరంగల్: బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అరూరి రమేశ్ పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం రాత్రి ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీలో వర్ధన్నపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రమేశ్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాడు. ఆయన ఓటమికి సొంత పార్టీకి చెందిన వారే కొందరు కోవర్టుగా పని చేశారని అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అసంతృప్తిగా ఉన్న ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకోగా.. కేటీఆర్, హరీశ్‌రావు, దయాకర్ రావు కేసీఆర్ దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడించారు. అయినప్పటికీ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్ష పదవికి, సభ్యత్వానికి రమేశ్ రాజీనామా చేశారు.

'అరూరి' రాజకీయ ప్రస్థానం..

అరూరి రమేశ్ 2009లో ప్రజారాజ్యం పార్టీతో రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించి ఆ పార్టీ తరఫున స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయాడు. తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరి 2014 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండేటి శ్రీధర్ పై 86,349 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. 2015 జనవరి 10 నుంచి 2018, సెప్టెంబరు 6 వరకు తెలంగాణ లెజిస్లేచర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల్లో అక్రమాలపై హౌస్ కమిటీ చైర్మన్‌గా పనిచేశాడు. 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున పోటీ చేసి తెలంగాణ జన సమితి పార్టీ అభ్యర్థి పగిడిపాటి దేవయ్యపై 99,240 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. 2022 జనవరి 26న టీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడయ్యాడు. 2023లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి వర్ధన్నపేట నుంచి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఆర్ నాగరాజు చేతిలో 19,458 ఓట్ల తేడాతో ఓడిపోయడు. అనంతరం ఈనెల 16న బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మరుసటి రోజు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరాడు. సుమారు ఆరు రోజులపాటు వరంగల్ పార్లమెంట్ పరిధి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసిన అనంతరం ఏకాభిప్రాయంతో పార్టీ అభ్యర్థిగా అరూరి రమేశ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

- ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం తేవాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

దేవరుప్పుల: ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేలా ప్రజా చైతన్యం తేవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్లమెంట్ ఎన్నిక సమాయత్తంపై దిశ, నిర్దేశనం చేశారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలకు ప్రజలు తలొగ్గి పదేళ్ల సుస్థిర పాలన అందించిన బీఆర్ఎస్‌ను ఓడించినా పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు నెలల పాలనతో ప్రజలు ఆత్మవిమర్శలో పడ్డారన్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తూనే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని అమలు పర్చేలా ప్రతిపక్షపాత్ర పోషించడంతో రాజీ పడకుండా పార్టీ శ్రేణులు పాటుపడాలన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఇంటింటా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హరీశ్‌రావు, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను పార్టీ శ్రేణులు సన్మానించారు. అంతకు ముందు చింతబాయితండాలో వరిపంట క్షేత్రాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి, ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషమ్, వైస్‌ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ సోమన్న, రైతు విభాగం నాయకుడు ఈదునూరి నర్సింహ్మారెడ్డి, ఏల సోమసుందర్, అధికార ప్రతినిధి హన్మంతు, నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్‌రావు

నేటి నుంచి వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి జాతర

దేవరుప్పుల: మండలంలోని కడవెండి రెవెన్యూ పరిధి పొట్టిగుట్ట వద్ద ఉన్న శ్రీ వానకొండయ్య లక్ష్మీనర్సింహ్మస్వామి జాతర నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానుంది. హోలీ పర్వదినం పురస్కరించుకొని దేవతమూర్తుల బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ఉగాది వరకు పెద్ద ఎత్తున జరుగుతుంది. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. కడవెండి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పద్మశాలీలు ఎడ్లబండిపై మగ్గం ఏర్పరచి నూతన వస్త్రాలను భజన మండలి, కోలాటం చప్పుళ్ల మధ్య గుట్టపైకి వెళ్లి కల్యాణోత్సవం జరిపించడం విశేషం. ఈ కల్యాణోత్సవానికి నేడు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి హాజరుకానున్నారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన వానకొండయ్య లక్ష్మీనర్సింహ్మస్వామి జాతర అభివృద్ధికి పాలకులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు (ఫైల్)

అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామంలో రైతు కొమ్మాట రఘుపతి ఆత్మహత్యకు కారణమైన రెవెన్యూ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రఘుపతి ఉరి వేసుకొని చనిపోవడం చాలా బాధాకరమన్నారు. రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్, సర్వేయర్ కే.రవీందర్‌లు లంచాలకు అలవాటు పడి రైతులను దోచుకొని అక్రమంగా రూ.లక్షలు సంపాదించారన్నారు. రెవెన్యూ కార్యాలయంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, అవినీతి అధికారులను సస్పెండ్ చేస్తూ పలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, బొడిగం చెంద్రారెడ్డి, పూర్ణచందర్, గిద్దెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాడు-నేడు

1970 సంవత్సరం నాటి గర్భగుడి



బంగారు పూతతో మెరిసిపోతున్న గర్భగుడి



పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి సంబంధించిన అరుదైన చిత్రం సోషల్ మీడియాలో వైరలయింది. 1970–71 సంవత్సరాలకు సంబంధించిన ఫొటో భక్తులు సోషల్ మీడియాలో పోస్టు చేసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈనెల 8న హనుమకొండకు చెందిన భక్తుడు భోనగిరి వివేక్-దేవిక దంపతులు సోమేశ్వర స్వామి గర్భగుడి లోపల మూడుపక్కల పంచలోహపు తాపడంతో కొత్త శోభను సంతరించుకుంది. ఆలయం లోపల బంగారు పూత రంగుతో మెరిసిపోతుండటంతో ప్రాధాన్యం సంతరించుకుంది.

- పాలకుర్తి టౌన్

ఫోన్ ట్యాపింగ్ కలకలం

ఏ-1గా ఇంటెలిజెన్స్ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు పేరు

- ఆయన స్వగ్రామం ఆత్మకూరు మండలం నీరుకుళ్ల
- ఇప్పటికే భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ భుజంగరావు అరెస్ట్
- ప్రకంపనలు రేపుతున్న ప్రజాప్రతినిధుల ఫోన్ ట్యాపింగ్
- ఉమ్మడి వరంగల్‌లో మరికొందరి పాత్రపైనా అనుమానం
- ఓరుగల్లులో హైదరాబాద్ బృందం ఆరా..



సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రజాప్రతినిధుల ఫోన్ ట్యాపింగ్ రోజుకో మలుపు తిరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఈ వ్యవహారం ఓరుగల్లులోనూ కలకలం రేపుతోంది. హైదరాబాద్ కేంద్రంగా మొదలైన విచారణ ఇప్పుడు వరంగల్ చుట్టూ తిరుగుతోంది. కీలక పాత్రధారి అయిన స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఇప్పటి వరకు ఆరుగురు నిందితులను 'సిట్' గుర్తించింది. ఇందులో ఏ-4గా జేఎస్ భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ భుజంగరావును గుర్తించిన విచారణ బృందం ఆదివారం రిమాండ్‌కు తరలించింది. ఇదే కేసులో ఇంటెలిజెన్స్ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు ఏ-1గా చేర్చడం కలకలం రేపుతోంది. ప్రభాకర్‌రావు స్వగ్రామం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామం కావడంతో ఈ ప్రాంతంలో చర్చ జరుగుతోంది.

ప్రణీత్‌రావు సాక్ష్యమే ఆధారం..

మాజీ ఐజీ ప్రభాకర్‌రావు నేతృత్వంలో ఏర్పాటైన ఎస్ఐబీ(పొలిటికల్) వింగ్‌లో కీలకంగా వ్యవహరించిన ప్రణీత్‌రావు ఇచ్చిన వివరాల ఆధారంగానే కేసు విచారణ జరుగుతోంది. ప్రణీత్‌ను అదుపులోకి తీసుకున్న ప్రత్యేక బృందం 15రోజుల క్రితం పాలకుర్తి, పర్వతగిరి, హనుమకొండ ప్రాంతాల్లో గోప్యంగా తనిఖీలు నిర్వహించింది. ఓ మాజీ మంత్రి కనుసన్నల్లో జనగామ జిల్లాలో వార్ రూమ్ ఏర్పాటు చేసి ఉమ్మడి వరంగల్‌కు చెందిన అధికార, విపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల సెల్‌ఫోన్ సంభాషణలను ట్యాపింగ్ చేశారన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలోనే సదరు కీలక ప్రజాప్రతినిధితో పాటు ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను 'సిట్' విచారించింది. ఆ తర్వాత హైదరాబాద్‌లో లభ్యమైన కీలక ఆధారాలను పరిశీలించి ఏ-1గా ఇంటలిజెన్స్ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు,ఏ-2గా సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌రావు, ఏ-3గా రాచకొండ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్, ఏ-4, ఏ-5లుగా అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, ఏ-6గా ఓ ప్రైవేట్ వ్యక్తిని చేర్చారు. ఇప్పటి వరకు ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ప్రకటించిన పోలీసులు రాధాకిషన్, ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును విచారించేందుకు న్యాయపరమైన అనుమతులు తీసుకోవడం పోలీసుశాఖలో హాట్‌టాపిక్‌గా మారింది.

మరికొందరు పోలీసులపైనా అనుమానం..

ప్రైవేట్ వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్ కేసులో భూపాలపల్లి అదనపు ఎస్పీ భుజంగరావును అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు.. ఉమ్మడి వరంగల్‌లో మరికొందరి పాత్రపైనా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భుజంగరావు ఎన్నికల ముందు వరకు పొలిటికల్ ఇంటెలిజెన్స్ విభాగంలో, తిరుపతన్న ఎస్ఐబీలో అదనపు ఎస్పీలుగా విధులు నిర్వర్తించారు. ఈ ఇద్దరిని రెండు రోజుల క్రితం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అలాగే అసెంబ్లీ ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లో పని చేసి.. ఎన్నికల కోడ్‌లో భాగంగా బదిలీపై ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న నలుగురు అధికారులను ఈ సందర్భంగా రెండు రోజుల క్రితం విచారించినట్లు తెలిసింది. అంతకు ముందు కూడా ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై వచ్చిన ఫిర్యాదులపైనా ఆరా తీసినట్లు సమాచారం. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు, శ్రవణ్‌రావు ఇళ్లల్లో పోలీసులు నిన్న, మొన్న తనిఖీలు నిర్వహించారు. వారు ఇప్పటికే దేశం దాటినట్లు వెల్లడి కావడంతో 'లుక్ అవుట్' సర్క్యులర్ జారీ చేశారు. అయితే ప్రణీత్‌రావు వాంగ్మూలంలో రాష్ట్రంలో జరిగిన ఎన్నికలు, ఉపఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల ముఖ్యనేతలను లక్ష్యంగా చేసుకొని ట్యాపింగ్‌లకు పాల్పడినట్లు పేర్కొనడంతో ఈ కేసు తుదిదశకు తెచ్చే ఉద్దేశంతో 'సిట్' హైదరాబాద్‌తో పాటు వరంగల్‌లోనూ పలువురిని విచారిస్తుండడం కలకలం రేపుతోంది.

క్లుప్తంగా

అప్పుల బాధతో ఇంటికి నిప్పు

నెక్కొండ : అప్పుల బాధలు.. ఇంట్లో గొడవల కారణంగా మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆదివారం ఇంటికి నిప్పంటించుకున్నాడు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కుమ్మరి వెంకన్న–ఐలమ్మ దంపతులతో పాటు కుమారుడు మధు కోడలు స్వప్న వారి పిల్లలు మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు.ఈ క్రమంలో మధు తోటి పరిచయస్తుల వద్ద రూ.1.5 లక్షలు అప్పు చేశాడు. అప్పు తీర్చాలని పరిచయస్తులు మధును ఒత్తిడి చేశారు. దీంతో తల్లిదండ్రులను, భార్యను అప్పు తీర్చాలని కోరగా వారు మిన్నకుండిపోయారు. కాగా మధు శనివారం కుటుంబ సభ్యులతో గొడవ పడిన అనంతరం స్వగ్రామానికి వచ్చేశాడు. అప్పుల బాధతో మనస్తాపానికి గురైన అతను ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఆదివారం ఉదయం ఇంటికి నిప్పంటించాడు. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటల్ని ఆర్పే యత్నం చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై మహేందర్ సంఘటన స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

- ఎస్‌హెచ్‌ఓకు ఉత్తర్వులు జారీ చేసిన తహసీల్దార్

జనగామ రూరల్: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద జనగామ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని స్థానిక తహసీల్దార్ వెంకన్న ఎస్‌హెచ్‌ఓకు ఉత్వర్తులు జారీ చేశారు. ఈనెల 20వ తేదీ రాత్రి 7.30 గంటలకు పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యేకు రైల్వేస్టేషన్ ప్రాంతంలోని చిరువ్యాపారులు సమ్యలు వివరించగా.. రోడ్డు పనులు చేపట్టడానికి హామీ ఇచ్చారని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నియమావళి మేరకు కేసు నమోదు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన లారీని చూపుతున్న పోలీసులు

తొర్రూరు : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ శివారు ప్రాంతాల్లో రేషన్ బియ్యం సేకరించి మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు డివిజన్ కేంద్రంలోని దుబ్బతండాలో పోలీసులు తనిఖీ చేపట్టారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకుని రూ.4.90 లక్షల విలువ చేసే 24.5 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. లారీ డ్రైవర్ మనోజ్ ధర్మదాస్ గులాడేపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సై పిల్లల రాజు, కానిస్టేబుల్ పరమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

సుర్మా.. ఆరోగ్యప్రదాయిని

- కంటి సంబంధిత వ్యాధులకు చెక్
- రంజాన్ మాసంలో ఆధ్యాత్మిక పరిమళం
- సుర్మా, అత్తర్లకు ముస్లింల ప్రాధాన్యం



దుకాణాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న సుర్మా, అత్తర్లు



కంటికి సుర్మా పెడుతున్న పెద్దలు

కాజీపేట : ముస్లింలు పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో 'సుర్మా' ఆద్యంతం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూ ప్రత్యేకత చాటుతోంది. ఈ మాసంలో ముస్లింలు వయోభేదం లేకుండా త్రికరణ శుద్ధితో ఉపవాసం(రోజా)ఉంటారు. ఖురాన్ పఠిస్తూ ఐదు పూటలా నమాజ్ ఆచరిస్తారు. మహ్మద్‌ప్రవక్త బాటను అనుసరిస్తూ నిష్టగా ఉంటారు. ఈ క్రమంలో ఈ మాసంలో ముస్లింల నేత్రాలకు అలంకరించే సుర్మాకు ఎంతో విశిష్టత ఉంది. విధిగా కళ్లకు సుర్మా అలంకరించడం పవిత్ర కార్యంగా భావిస్తారు. సువాసన వెదజల్లే అత్తర్లకు ప్రాధాన్యమిస్తారు.

ఇదీ..సుర్మా ప్రశస్తి

నిత్యం అల్లాహ్ నామస్మరణలో గడిపే దైవప్రవక్త హజ్రత్ మూసా అలైహిసలా తుస్సలాంకు అల్లా ప్రసన్నం పొంది అతడిని అల్లా ఎక్కడున్నాడో చూపించమని అనునయులు కోరుతారు. దీంతో ఈజిప్ట్, సిరియా ప్రాంతాలకు చెందిన పెద్దలను సమీపంలోని కోహితూర్ పర్వతం వద్దకు తీసుకెళ్తారు. అక్కడ ఒక్కసారి అల్లాహ్ నూర్ (ఓ వెలుగు)ప్రత్యక్షంకావడం చూసి ఆశ్చర్యానికి గురవుతారు.అప్పుడే కోహితూర్ పర్వతం భస్మమై బూడిదగా(చూర్ణంగా) మారుతుంది. దైవ సంకల్పం కళ్లెదుట సాక్షాత్కరించడంతో తమలోని భక్తి ఉప్పొంగి ఆ చూర్ణాన్ని వారు కళ్లకు అద్దుకుంటారు. ఈ సమయంలో తమ కళ్లకు సుదూరంలోని చీమల కదలికలను సైతం పసిగట్టే విధంగా ప్రకాశవంతం కావడం గమనించి అల్లాహ్ కృపవల్లనే సాధ్యపడిందని భావిస్తారు. అప్పటి నుంచి కోహితూర్ పర్వతానికి చెందిన రాళ్ల చూర్ణమే క్రమంగా సుర్మాగా రూపాంతరం చెందిందనేది ముస్లింల ప్రగఢ నమ్మకం.

కళ్లకెంతో మేలు...!

భక్తితోపాటు వైద్యపరిభాషలోనూ ఈ సుర్మాకు ఆరోగ్యప్రదాయినిగా పేరుంది. కంటికి సంబంధించిన వ్యాధులకు నివారణగా, కళ్లకు చలువగా పనిచేస్తుంది. నమాజ్ చేయడానికి ముందు వజూ ఆచరించాక మహ్మద్‌ప్రవక్త కంటికి సుర్మా పెట్టుకునే వారని ప్రతీతి. రాత్రివేళ నిద్రపోయేముందు కళ్లకింద సుర్మ రాసుకోవడం సంప్రదాయంగా వస్తోంది. సుర్మాతో కంటికి సంబంధించిన వ్యాధులు రావని నిరూపితం కావడంతో ఇతరులు కూడా సుర్మాను రాసుకోవడానికి ఆకర్షితులవుతున్నారు. మహిళలు కళ్లకు కాటుక బదులు సుర్మా వాడడానికి ఇష్టపడుతున్నారు. అతిథులకు సుర్మ, అత్తర్లు పూయడం ద్వారా గౌరవించే సంప్రదాయాన్ని ముస్లింలు కొనసాగిస్తున్నారు.

సుర్మ, అత్తర్ల విక్రయాలు..!

కాజీపేట, హనమకొండ, వరంగల్ వంటి పట్టణాలతో పాటు అనేక గ్రామాల్లో రంజాన్ సందర్భంగా అత్తర్లు, సుర్మా విక్రయాలకు గిరాకీ ఉంటుంది. దీనికోసం జిల్లాలో పలు అత్తర్లు, సుర్మా అమ్మకాల దుకాణాలు వెలిశాయి. సుర్మా కిలో పొడి ధర రూ.175 నుంచి రూ.550 వరకు ఉంటుంది. వీటిని చిన్న సీసాల్లో నింపి విక్రయిస్తుంటారు. ఇవి రూ10 నుంచి రూ. 100 విక్రయిస్తున్నారు. ఇక కంపెనీని బట్టి వీటి ధరలు నిర్ణయిస్తున్నారు. సుర్మాను భద్రపరచడానికి ఆకర్షణీయమైన ఆకారాల్లో సుర్మేస్తు (భరిణె) మార్కెట్లో ఉన్నాయి. వీటి ధర రూ.50 నుంచి రూ.300 వరకు అందుబాటులో ఉన్నాయి.

ఆకతాయిల హల్‌చల్‌పై నజర్

- శంభునిపేట వీధుల్లో ప్రత్యేక నిఘా
- 'సాక్షి' కథనానికి స్పందించిన పోలీస్ అధికారులు
- సీఎం, డీజీపీకి ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన సామాజిక కార్యకర్త ఫని



సీఎం, డీజీపీకి ట్విట్టర్‌లో చేసిన పోస్ట్

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట వీధుల్లో గంజాయి మత్తులో హల్‌చల్ చేస్తున్న ఆకతాయిలు, మైనర్లు, యువకులపై పోలీసు అధికారులు దృష్టి సారించారు. రోడ్డుపై నడిచివెళ్తున్న బాలికలను అడ్డుకుని ఈవ్‌టీజింగ్ పాల్పడుతున్న వారి అగడాలను అరికట్టేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. 'గంజాయి మత్తులో మైనర్ల హల్‌చల్.. దూపకుంట రోడ్డులో బాలికలపై ఈవ్‌టీజింగ్' శీర్షికలతో ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య స్పందించారు. బాలికలు, మహిళలకు భద్రతకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీకి సామాజిక కార్యకర్త ఎండీ.ఫసి ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా, ఏసీపీ నందిరామ్‌నాయక్ సూచనల మేరకు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సిబ్బందితో కలిసి ఉదయం పర్యటించారు. ఆకాతాయిల అగడాలపై ఆరాతీశారు. రహదారులపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. పోకిరీలు, ఆకతాయిలు కంటపడితే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై గోవర్ధన్, మున్నూరిల్లా, మహమూద్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

తెలిసిన వారే హత్య చేశారా?

- పోలీసుల అదుపులో నిందితుడు !

దుగ్గొండి : మండలంలోని మైసంపల్లికి చెందిన వివాహిత వెంగల సుప్రియ శనివారం అనుమానాస్పద మృతి చెందగా పోలీసులు ఆయా కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఆమె సెల్‌ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా అనుమానాస్పద వ్యక్తులు, సుప్రియ, కిరణ్‌లతో పాటు కుటుంబ సభ్యులకు సన్నిహిత సంబంధాలు ఉన్న వారిని సైతం విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా పలువురు వ్యక్తులను డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో విచారిస్తున్నట్లు సమాచారం.. అయితే హత్య చేసింది మాత్రం ఒక్కడేనని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. నిందితుడు సుప్రియ కుటుంబానికి బాగా కావాల్సిన వ్యక్తియేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు కుటుంబాల మధ్య ఇటీవల చిన్నపాటి గొడవలు ఉన్నాయని స్థానికంగా గుసగుసలు వినవస్తున్నాయి. నిందితులు ఎంతటి వారైనా పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి శిక్షపడేలా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సేంద్రియ ఎరువు ఉపయోగించాలి

- ఓయూ రీసెర్చ్ ఫెల్లో కత్తెరసాల శ్రీనివాస్



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

దేవరుప్పుల : వ్యవసాయ భూముల్లో సేంద్రియ ఎరువు తప్పనిసరిగా ఉపయోగించాలని సుస్థిర వ్యవసాయ రంగం పరిశోధకుడు, ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ సీనియర్ రీసర్చ్ ఫెల్లో కత్తెరసాల శ్రీనివాస్ కోరారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములు అందించాలని ఆయన పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కోలుకొండను ఆయన సందర్శించి పలు రకాల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఆమ్ల, క్షార గుణాలకు సంబంధించి శాస్త్రీయ ఉపకరణాల ద్వారా రైతుల సమక్షంలో పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక దిగుబడి, ఆదాయం కోసం విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడడంతో వ్యవసాయ భూమిలో ఆమ్ల, క్షార గుణాల కోల్పోయే అవకాశం ఉందన్నారు. నేడు పంట భూముల్లో సారం క్షీణించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో పంటలు పండించుకోవాలంటే భూమిని ఎలా సాగు చేయాలి అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. పంట కోత తర్వాత వ్యర్థాలను తగులబెట్టొద్దని సూచించారు. అలా చేయడం వల్ల భూమిలో ఉండే బ్యాక్టీరియా చనిపోతుందన్నారు. పంట వ్యర్థాలను తగులపెట్టకుండా భూమిలో అలాగే వదిలిపెట్టడం కానీ కలియ దున్నడం వల్ల భూమికి మేలు జరుగుతుందన్నారు. పంట క్షేత్రాలను నాగలి, ట్రాక్టర్‌తో ఐదు ఇంచుల లోతుకు మించి దున్నకూడదని రైతులకు సూచించారు. ప్రతి రెండేళ్ల ఒకసారి పంట మార్పిడి చేసుకోవాలన్నారు. రైతులు అడిగిన సందేహాలను శ్రీనివాస్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్. పరంధాములు, రీసెర్చ్ స్కాలర్ గడ్డం లింగారెడ్డి, రైతులు దామెర పెద్దులు, శంకర్, కొడగాని కృష్ణమూర్తి, చిక్కుడు ప్రవీణ్, బుచ్చమ్మ, కన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కళలకు కులమతాలు లేవు

- శ్రీశారదామాత శృంగేరి శంకరమఠం దేవాలయ ప్రధానార్చకులు సంగమేశ్వరశర్మ
- వైభవంగా పేరిణినాట్య కళాకారుల సామూహిక గజ్జెపూజ



గజ్జెపూజలో పాల్గొన్న గురువులు, విద్యార్థులు



విద్యార్థి కాలికి గజ్జెను అలంకరిస్తున్న రంజిత్ దంపతులు

హన్మకొండ కల్చరల్ : కళలకు కులమతాలు లేవని, ఇతర మతాల విద్యార్థులు కూడా నాట్యం నేర్చుకుని గజ్జపూజలో పాల్గొనడం ఆనందంగా ఉందని శ్రీశారదామాత శృంగేరి శంకరమఠం దేవాలయ ప్రధానార్చకులు సంగమేశ్వరశర్మ అన్నారు. ఆదివారం వరంగల్ శ్రీనివాస కాలనీ దేవాలయంలోని శ్రీశారదామాత శృంగేరి శంకరమఠంలో పద్మశ్రీ డా.నటరాజ రామకృష్ణ 101 జయంతోత్సవాన్ని పురస్కరించుకుని నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమి పేరిణి నృత్యాలయం ఆధ్వర్యంలో పేరిణినాట్య కళాకారుల సామూహిక గజ్జెపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పేరిణి నాట్య గురువులు గజ్జెల రంజిత్, నవ్యజ దంపతులు పాల్గొని విద్యార్థులకు పూజ చేసిన గజ్జెలను అలంకరించారు. అనంతరం విద్యార్థులు అమ్మవారికి అభిముఖంగా గణపతి గద్య అంశంపై నాట్యం చేశారు. అకాడమి అధ్యక్షుడు మోతుకూరి చంద్రకళ పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు మన్విత, లేఖన, శాన్వి, వర్షికవర్మ, దాక్షయని, తన్విశ్రీ, భవిష్యశ్రీ, జన్నుల్లిస్సి, ఎండి రీయాఫర్హా, అంజలి, లావణ్య, ఉజ్వల, సహస్ర, మృదంగం విద్వాంసులు ఏడిద భీమశంకర్, శ్రవణ్‌రాజ్, సీనియర్ కళాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైకాలజీ కోర్సులతో ఉపాధి అవకాశాలు

- కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ రామచంద్రం



ఎమ్మెస్సీ సైకాలజీ ఫైనలియర్ విద్యార్థులతో డైరెక్టర్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: సైకాలజీ కోర్సులతో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని కాకతీయ యూనివర్సిటీ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు. దూరవిద్యా కేంద్రంలో ఆదివారం ఎమ్మెస్సీ సైకాలజీ చివరి సంవత్సరం విద్యార్థులకు తరగతుల ముగింపు సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 21వ శతాబ్దంలో సైకాలజిస్టుల అవసరం చాలా ఉందని, ఒత్తిడి, మానసిక ఆందోళన, ఏకాగ్రత లోపం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. ప్రస్తుతం సైకాలజిస్టుల కౌన్సిలింగ్ సేవలు ప్రతీ రంగంలో అవసరమని పేర్కొన్నారు. ఈ కోర్సులు చేసే విద్యార్థులకు నిష్ణాతులచే బోధన, ప్రాక్టికల్స్ నిర్వహించినట్లు చెప్పారు. సైకాలజీ విభాగం ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం, డాక్టర్ నహిదాపర్వీన్, డాక్టర్ మాలతి, డాక్టర్ కందాల రామయ్య, జి.అపర్ణ పాల్గొన్నారు. అనంతరం చివరి సంవత్సరం విద్యార్థులతో ఫొటో సెషన్ నిర్వహించారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ప్రమాదాల్లో పలువురు మృతిచెందారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్, అలాగే బయ్యారం మండలానికి చెందిన పశువుల కాపరి, భూపాలపల్లి జిల్లా కాటారంలో జరిగిన రోడ్డుప్రమాదంలో వ్యక్తి, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రాంధన్‌తండాకు చెందిన మహిళ మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ ..



అశోక్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై కె.శివ తెలిపిన కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన ఆలకుంట్ల చెన్నయ్య, సాయిమల్లమ్మ దంపతుల కుమారుడు అశోక్ (19) ఆదివారం తెల్లవారుజామున బీసీ కాలనీ నుంచి ట్రాక్టర్ నడుపుకుంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ పల్టీ కొట్టి పక్కనే ఉన్న ఎస్సారెస్పీ కాల్వలో వెళ్లగా ఇంజన్ అశోక్ మీద పడడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బావిలో పడి పశువులకాపరి..



వీరన్న మృతదేహం

బయ్యారం : ప్రమాదవశాత్తు బావిలో పడి పశువుల కాపరి మృతిచెందిన ఘటన ఆదివారం బయ్యారం సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన పశువుల కాపరి కందుకూరి వీరన్న(40) రోజువారీగా పశువులను మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో తాగునీటి కోసం పశువులను బావి వద్దకు తీసుకెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందాడు. వీరన్న మృతదేహాన్ని స్థానికులు బయటకు తీశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

కాటారం : మండలంలోని గుండ్రాత్‌పల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కనుకుంట్ల సమ్మయ్య తన ద్విచక్ర వాహనంపై గుండ్రాత్‌పల్లి నుంచి దామెరకుంట వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో గజ్జెల సమ్మయ్య కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై దామెరకుంట వైపు నుంచి వస్తూ ఎదురెదురుగా ఢీ కొట్టాడు. దీంతో కనుకుంట్ల సమ్మయ్య బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అటువైపు నుంచి బైక్‌పై వస్తున్న పున్నం సురేశ్ ద్విచక్రవాహనాలు ఢీకొన్న విషయం తెలియక వాటిని ఢీకొని గాయపడ్డాడు. కనుకుంట్ల సమ్మయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

చికిత్స పొందుతున్న మహిళ..



హస్లీ(ఫైల్)

వర్ధన్నపేట : బీరువాలో దాచిన డబ్బులు తీసేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తు కుర్చీ నుంచి జారిపడడంతో తలకు తీవ్ర గాయమై చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని రాంధన్‌తండాలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం రాంధన్‌తండాకు చెందిన గుగులోత్ హస్లీ(63) కేవులా దంపతులు. ఇటీవల కందులు విక్రయించిన నగదును బీరువాలో దాచి పెట్టారు. కాగా శనివారం సాయంత్రం బీరువాలో ఉన్న డబ్బులు తీయడానికి హస్లీ కుర్చీ వేసుకుని పైకి ఎక్కి నగదు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారికింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే వర్ధన్నపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి కుమారుడు దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వడదెబ్బకు వృద్ధురాలి మృతి



లక్ష్మీనర్సమ్మ మృతదేహం

ఏటూరునాగారం: ఏటూరునాగారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వృద్ధురాలు వడదెబ్బకు గురై మృతి చెందింది. ప్రయాణికుల కథనం ప్రకారం.. కన్నాయిగూడెం మండలం సింగారం గ్రామానికి చెందిన పోశెట్టి లక్ష్మీనర్సమ్మ(58) అనారోగ్యంగా ఉండడంతో ఆదివారం ఆమె కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి ఆస్పత్రిలో చికిత్స అనంతరం బస్టాండ్ వచ్చారు. మూత్రవిసర్జనకు వెళ్లిన లక్ష్మీనర్సమ్మ ఎండ తీవ్రతతో సొమ్మసిల్లి పడిపోయింది. గమనించిన ప్రయాణికులు బస్టాండ్ ఆవరణలోకి తీసుకువచ్చి పరిశీలించగా అప్పటికే చనిపోయిందని మృతురాలి కుమారుడు శ్రీనివాస్ బోరున విలపిస్తూ చెప్పాడు.

రామప్పను సందర్శించిన న్యాయమూర్తులు



రామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న న్యాయమూర్తులు



నందీశ్వరుడి వద్ద ఆరు జిల్లాలకు చెందిన న్యాయమూర్తులు

వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయాన్ని ములుగు, కరీంనగర్, నిర్మల్, మెదక్, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల జడ్జిలు లలిత శివజ్యోతి, బి.ప్రతిమ, ఎ.కర్ణాకుమార్, పి.లక్ష్మీశారద, పి.చంద్రశేఖరప్రసాద్, ఎస్.శ్రీదేవి ఆదివారం సందర్శించారు. శ్రీరామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం వారికి పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం నందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ శిల్పాకళాసంపద గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించారు.

జాగ్రత్తలతో నాణ్యత.. దిగుబడి

- పసుపు ఉడకబెట్టడం, ఆరబెట్టడంలో మెళకువలు పాటించాలి
- ఉద్యానశాఖ అధికారి రమేశ్ సూచనలు



ఉద్యానశాఖ అధికారి రమేశ్



పసుపు పంట (ఫైల్)



పసుపును ఉడికించే యంత్రం

చెన్నారావుపేట : ఇంట్లో ఏ శుభకార్యం జరిగిన పసుపు ప్రధానమైనది.. తినే కూరల్లోను.. యాంటిబయాటిక్‌గా పసుపును వాడుతున్నాం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులు ఎక్కువగా పసుపు పంటను సాగు చేస్తున్నారు. వ్యవసాయంలో రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు పసుపును పండిస్తారు. పసుపు కొమ్ములు విత్తినప్పటి నుంచి మార్కెట్‌కు తరలించే వరకు తగిన జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యతతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించొచ్చని ఉద్యానశాఖ అధికారి రమేశ్ తెలిపారు.

దీర్ఘకాలిక రకాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఎక్కువగా ఎర్రగుంటూరు, శేలం పసుపు రకాలను సాగు చేస్తున్నారు. వీటి కాలపరిమితి తొమ్మిది నెలలు. జూన్‌లో విత్తనం వేస్తే మార్చి చివరి నాటికి పూర్తి పక్వానికి వస్తుంది. కానీ రైతులు డిసెంబర్ చివరి నుంచి మొదలుకొని జనవరి చివరి వరకు తవ్వేస్తుంటారు. అలా కాకుండా కాలపరిమితి పూర్తైన తర్వాతనే పసుపును దున్ని ఏరుకోవాలి.

స్వల్పకాలిక రకాలు..

ఏసీసీ–79, ఏసీసీ–48, రాజేంద్ర సోనాలి, సోనియా వంటి స్వల్పకాలిక రకాలను మార్చిలో దున్నుకోవాలి. ఆకులు పూర్తిగా పసుపు రంగుకు మారితేనే గాని పసుపు కొమ్ములు తవ్వకూడదు. పసుపును ముందే తవ్వేయడంతో రికవరి శాతం తగ్గడమే కాకుండా ఎండిన తర్వాత ముడతలు పడుతుంది. దీంతో పసుపు నాణ్యత తగ్గి బరువు కోల్పోయే అవకాశాలుంటాయి. పసుపు ఆకులు కోసిన అనంతరం కొమ్మకు దెబ్బతగలకుండా పసుపు కొమ్ములను తవ్వాలి. అనంతరం పసుపు కొమ్ములకు ఉన్న మట్టిని పూర్తిస్థాయిలో తీసివేసి పది రోజుల్లో ఉడకబెట్టాలి. అలా ఉడకబెట్టిన తర్వాత పసుపు కొమ్ములపై కొన్ని వాసన గుళికలను చల్లి కుప్పపోసి ఆకు కప్పి ఉంచాలి.

నూతన పద్ధతులు

పాశ్చాత్య దేశాల నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పసుపు ఎగుమతులకు గిరాకి పెరుగుతుంది. కాబట్టి పసుపును స్టీం బాయిలింగ్ చేయడం మంచిది. పాత కాలపు పద్ధతులు వాడితే కడాయిల్లో స్వచ్ఛమైన నీరు పోయాలి. పేడ ఏమాత్రం కలుపవద్దు. సుమారుగా 30 నుంచి 45 నిమిషాల వరకు ఉడికించాక సిమెంట్ కల్లాల మీదా లేదా టార్పాలిన్‌ల మీద ఎండపోయాలి. 15 నుంచి 20 రోజుల పాటు నిత్యం పైకి కిందికి కదుపుతు ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత పసుపు కొమ్ములకు పాలిషింగ్ చేయాలి. పసుపు కొమ్ములను పాలిసింగ్ డ్రమ్ములో వేసి పాలిసింగ్ చేయడం ఉత్తమం. పాలిసింగ్ చేసిన పసుపును బస్తాల్లో నింపి మార్కెట్‌కు తరలించాలి. మార్కెట్‌కు తరలించే సమయంలో బస్తాలపై రైతు పేరు, రంగులతో రాయకుండా తమకు గుర్తుండేలా బస్తాలకు కొన్ని దారాలతో కుట్టిన తీసుకుపోవాలి. ఈ విధమైన జాగ్రత్తలు పాటించడం వల్ల పసుపు నాణ్యత పెరగడంతో మంచి ధర వస్తుంది. దీంతో రైతు ఆర్థికంగా బలోపేతం అవుతాడు.